క్లుప్తంగా

మొక్కలకు నీళ్లు



వాజేడు : ఎండ ఎక్కువగా ఉండడంతో మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బంది మంగళవారం మొక్కలకు నీళ్లు పోశారు. పంచాయతీ ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చిన నీలాద్రి, సరబాబు, రాంకీ రహదారికి ఇరువైపుల ఉన్న మొక్కలకు పోశారు.

బాలికల మినీ గురుకులం పరిశీలన



వాజేడు : మండలంలోని జంగాలపల్లిలోని బాలికల మినీ గురుకులాన్ని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశాల మేరకు ఎంపీఓ శ్రీకాంత్‌నాయుడు మంగళవారం పరిశీలించారు. భోజనాలను మెనూ ప్రకారం వండింది లేనిది చూడటంతో పాటు నాణ్యమైన కూరగాయలను అందిస్తున్నది లేనిది చూశారు. మినీ గురుకులం వద్ద సైడ్ కాల్వ ఇబ్బందిగా ఉందని దానిని మరమ్మతులు చేయాల్సి ఉన్నట్లు ఎంపీఓ తెలిపారు. భోజనం విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదన్నారు.

జాతీయ రహదారికి మరమ్మతులు



వాజేడు : మండల పరిధిలోని కడేకల్ నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన లొట్టిపిట్ట గండి వరకు 163 నంబర్ జాతీయ రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. కడేకల్ గ్రామం నుంచి లొట్టిపిట్ట గండి వరకు 13 కిలోమీటర్ల రహదారి మరమ్మతు పనులను చేపట్టారు. మరమ్మతుల కోసం ఇంతకు ముందే రూ.9 కోట్లు మంజూరయ్యాయి. కాగా ఇప్పుడు ఆ నిధులతో పనులను చేపట్టా రు. రహదారిపై బీటీ వేస్తూ రోలింగ్ చేస్తున్నారు.

అక్రమంగా బియ్యం తరలింపు



వెంకటాపురం(కె) : మండలంలోని బర్లగూడెం పంచాయతీ చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి సోమవారం రాత్రి వర్కర్లు అక్రమంగా బియ్యం తరలిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్న సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి ట్రాక్టర్‌లో మూడు బస్తాల్లో బియ్యం తరలిస్తున్నారని తెలిపారు. గమనించిన గ్రామస్తులు ట్రాక్టర్ అడ్డుకోవటంతో పాఠశాల ముందే బియ్యం ట్రాలీలో వ తెలిపారు. ట్రాలీలో ఉన్న బియ్యాన్ని తిరిగి హాస్టల్‌కు తరలించామని చెబుతున్నారు. కాగా బియ్యం హాస్టల్‌కు వెళ్లాయా లేక బ యటకు తరలించారా అనేది తెలియాల్సి ఉంది.

అస్తవ్యస్తంగా రైతువేదికల నిర్వహణ

- బీఆర్‌ఎస్ హయాంలో ప్రతి నెలా రూ. 9 వేలు విడుదల
- మూడేళ్లుగా నిలిచిన నిధులు
- ఏఈఓల సొంత ఖర్చుతోనే పనులు



మండల కేంద్రంలో నిర్మించిన రైతు వేదిక

కన్నాయిగూడెం : మండలంలో గత ప్రభుత్వం రైతులకు సమావేశాలు, సభలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి వెసులుబాటుగా రైతు వేదికలను నిర్మించింది. వాటి నిర్వహణ బాధ్యత వ్యవసాయ అధికారులకు అప్పగించి ఖర్చుల కోసం ప్రతి నెలా రూ.9 వేల నిధులు విడుదల చేసి కొనసాగించింది. కానీ 2022 సెప్టెంబర్ నుంచి నిర్వహణ కోసం ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులను నిలిపి వేసింది. దీంతో రైతువేదికల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. కార్యాలయంలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ బిల్లులు, సమావేశాలకు స్నాక్స్, టీలు వంటి కోసం నిధులు ఏర్పాటు చేయడం మండల వ్యవసాయ అధికారులకు పెనుభారంగా మారింది. అధికారులు సొంత ఖర్చులతో నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

క్షేత్రస్థాయిలో రైతులకు సేవలు

గత ప్రభుత్వం రైతులకు క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించుకోవడం, శిక్షణ ఏర్పాటు కోసం రైతు వేదికలను ఏర్పాటు చేసింది. ఇందులో రైతులు వ్యవసాయ అధికారులు సమావేశాలు ఏర్పాటు చేసుకొని వారికి ఉన్న సమస్యలు నివృత్తి చేయడంతో పాటు వారికి పంటలపై సలహాలు, సూచనలు ఇవ్వడం కోసం వాటి నిర్వహణ నెలకు రూ.9వేల నిధులను ఇచ్చి కొనసాగించింది. ఈ నిధులతో పారిశుద్ధ్య పనులు, విద్యుత్ బిల్లులు, స్టేషనరీ, సమావేశాలు, శిక్షణ వంటి వాటికి వచ్చిన వారికి టీలు, స్నాక్స్ వంటివి ఏర్పాటు చేయడం కోసం నిధులను వాడుకోవాలని తెలిపారు.

మూడేళ్లుగా నిలిచిన నిధులు

రైతు వేదికలను ఏర్పాటు చేసి నిర్వహణ కోసం విడుదల చేస్తున్న నిధులు 2022 సెప్టెంబర్ నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి నుంచి నిర్వహణ ఏఈఓ, ఏఈఓలకు భారంగా తయారైంది. ఏ సమావేశం ఏర్పాటు చేసిన స్టేషనరీ నుంచి మొదలు, పారిశుద్ధ్యం, విద్యుత్, టీలు, బిస్కెట్స్ వంటివి అన్ని సొంత ఖర్చులతో ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా రైతు వేదికల నిర్వహణ కోసం నిధులు విడుదల చేయాలని మండల రైతులు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు వేదికలకు నెలనెలా ఖర్చుల కోసం ప్రభుత్వం ప్రకటించి డబ్బులను ఇవ్వాలి. ఇవ్వకపోవడంతో వ్యవసాయ అధికారులు సొంత ఖర్చులు పెట్టుకొని నిర్వహణ కొనసాగిస్తున్నారు.

– నరెడ్ల అశోక్, ముప్పనపల్లి

నిర్వహణ సమస్యగా మారింది



రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధులు మూడేళ్ల నుంచి నిలిచిపోయాయి. దీంతో నిర్వహణ అధికారులకు పెద్ద సమస్యగా మారింది. నిధులు విడుదల చేస్తే నిర్వహణ సులభంగా ఉంటుంది.

– మహేష్, ఏఓ, కన్నాయిగూడెం

ఐటీడీఏలను బలోపేతం చేయాలి

- గవర్నర్‌కు ఆదివాసీ ప్రతినిధుల విన్నపం



ఎస్ఎస్ తాడ్వాయి : గవర్నర్‌కు వినతి ప్రతం అందజేస్తున్న నాయకులు



వెంకటాపురం (కె) : గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి : ఐటీడీఏలను బలోపేతం చేయాలని ఐటీడీఏల ద్వారానే బదిలీలు, ఉద్యోగాలు, పదోన్నతులు కల్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్, వట్టం ఉపేందర్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. మంగళవారం కొండపర్తికి వచ్చిన గవర్నర్‌ను ఆదివాసీ సంఘాల ప్రతినిధులు కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కొండపర్తిని గవర్నర్ దత్తత తీసుకోవడం ఆదివాసీ సంఘాల తరఫున ఆయన అభినందనలు తెలిపారు. ఐటీడీఏ ప్రాంతంలో జీఓ 57 ప్రకారం సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్ అమలులో ఉందన్నారు. 29 శాఖలలో 29 రకాల ప్రత్యేక జీఓలు ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాల లో ఆదివాసీలకు ఇవ్వాలని ఉన్నప్పటికీ నేడు తెలంగాణ ప్రభుత్వం టీఎస్‌పీఎస్ ద్వారా జనరల్ నోటిఫికేషన్లు ఇస్తూ ఆదివాసీలకు అన్యాయం చేస్తుందన్నారు. అన్ని జీఓలను కలిపి ఆర్డినెన్సు చేసేలా కృషి చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో జీఓ 317 నూతన జోనల్ విధానాన్ని మినహా హించాలన్నారు. తుపాకులగూడెం దేవాదుల బ్యారేజీలు కట్టి గోదావరి జలాలను 13 లక్షల ఎకరాలకు మైదాన ప్రాంతాలకు నీరు తరలిస్తున్నారు కానీ ఆదివాసీలకు మాత్రం ఒక ఎకరం కూడా సాగు నీరు అందడం లేదన్నారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని మొక్కజొన్న విత్తనాల్లో రైతులకు కల్తీ విత్తనాలు అందించిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు విన్నవించుకున్నట్లు తెలిపారు. గవర్నర్‌కు వినతిప్రతం ఇచ్చేందుకు స్టేజీ వద్దకు వెళ్లే క్రమంలో పోలీసులు, అధికారులు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు అడ్డుకోవడంతో గవర్నర్ రోడ్డుపై కలవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, ఆదివాసీ నవనిర్మాణ సేనా రాష్ట్ర అధ్యక్షుడు నరసింహమూర్తి, విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్నెబెల్లి గణేష్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పాయం కోటేశ్వరరావు, మండల అధ్యక్షుడు మోకాల వెంకటేష్ పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని వినతి

వెంకటాపురం(కె): బాండ్ మొక్కజొన్న పంటను సాగు చేసిన రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం తాడ్వాయి మండలంలో పర్యటిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఆదివాసీ నవ నిర్మాణ సేనా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. బాండ్ మొక్కజొన్న పంటలను సాగు చేసి రైతులు దిగుబడులు రై తులు నష్టపోయారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. బాండ్ మొక్కజొన్న పంట సాగుపై వి చారణ చేసి రైతులకు న్యాయం చేయాలని గవర్నర్‌ను కోరారు, వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు పాయం రాంబాబు, నాగుల ప్రవీ ణ్, లేకం మధు, మిచ్చా ధన, అట్టం సారయ్య, వెంకటరమణ ఉన్నారు.

సమాజంపై అవగాహన అవసరం



విద్యార్థులు చేసిన ఫుడ్‌ను పరిశీలిస్తున్న ఉపాధ్యాయ బృందం

- ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు

ఏటూరునాగారం : విద్యార్థులు సమాజంపై అవగాహన అవసరం అని ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఎస్ శిరి జెడ్పీహెచ్‌ఎస్‌లో ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్‌లో భాగంగా హర్యానా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఇంటి దగ్గర హర్యాన వంటలను తయారు చేసి ప్రదర్శించారు. ఉపాధ్యాయులు వాటిని రుచి చూసి విద్యార్థులకు కితాబు ఇచ్చారు. అనంతరం పాటలు, క్విజ్, నృత్యాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థుల్లో స ప్తకళలు ఉండాలన్నారు. చదువు, క్రీడలు, నృత్యం తదితర అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. రాజకీయ, సామాజిక, కుటుంబ స్థితిగతులు, సమాజంలో జరుగుతున్న మార్పులను అవగా హన చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు సూర్య, సుమన్, శ్రావణ్, శ్రావణ్, రవళిక, మాధవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలను స్కూల్‌లో చేర్పించాలి



పాఠశాలలో రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి రమాదేవి

ఏటూరునాగారం : బడి ఈడు పిల్లలను స్కూల్‌లో చేర్పించాలని పంచాయతీ కార్యదర్శి రమాదేవి అన్నారు. మండలంలోని గంటలకుంట గ్రామంలో ని ప్రభుత్వ పాఠశాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థుల హాజరు రిజిష్టర్, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య మరింత పెంచాలన్నారు. అక్షర జ్ఞానం ఎంతో ముఖ్యమని గూడెంవాసులకు వివరించారు. తల్లిదండ్రులు వారి పిల్లలను బడికి పంపించాలని, పనులకు తీసుకెళ్లొద్దని కోరారు. జీపీ సిబ్బంది లక్ష్మీనారాయణ, సత్యంతో పాటు తదితరులు ఉన్నారు.

ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాతా



ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

గోవిందరావుపేట : ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైఆర్‌జీ కేర్ లింక్ వర్కర్స్ స్కీం సంస్థ లింక్ వర్కర్ తప్పెట్ల కిషన్ అన్నారు. మండలంలోని పస్రాలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాతా ప్రోగ్రాం నిర్వహించి స్థానిక ప్రజలకు ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ హెచ్ఐవీ నాలుగు విధాలుగా మానవులకు సోకుతుందన్నారు. సురక్షితం కాని లైంగిక సంబంధాల వల్ల, కలుషితమైన సూదుల వల్ల, పరీక్షించని రక్త మార్పిడి వల్ల, హెచ్ఐవీ తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకి వస్తుందని తెలిపారు. ప్రతి గర్భిణీ తప్పకుండా హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలని, ఒకవేళ ఆమెకు హెచ్ఐవీ పాజిటివ్ అని తెలిస్తే తల్లి నుంచి పుట్టబోయే బిడ్డకి హెచ్ఐవి ఎయిడ్స్ రాకుండా అందుబాటులో మందులు ఉన్నాయని పేర్కొన్నారు. టీబీ పేషెంట్ హెచ్ఐవీ పరీక్ష చేయించుకోవాలి సూచించారు. కార్యక్రమంలో కళాజాత రమేష్ బృందం, ఆశా వర్కర్స్ లు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి



వాజేడు : రోగిని పరీక్షిస్తున్న వైద్యులు



వెంకటాపురం(కె) : వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

వాజేడు: వేసవి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాతాశిశు సంరక్షణ వైద్యాధికారి యోషిత, ప్రగళ్లపల్లి సబ్‌సెంటర్ వైద్యాధికారిణి గ్యానస అన్నారు. మంగళవారం మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఇంటింటికి తిరిగి వైద్యం అందించారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గర్భిణులను పరీక్షించి మందులను ఇచ్చారు. రక్తపోటు ఉన్న వారికి నెలవారీగా మందులను ఆశ కార్యకర్తల ద్వారా అందిస్తామని తెలిపారు. వారి వెంట స్టాఫ్‌నర్స్ అనూష, ఆశ కార్యకర్తతో పాటు తదితరులు ఉన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్యపరీక్షలు

వెంకటాపురం(కె) : స్థానిక ఆరోగ్య మహిళా కేంద్రంలో వెద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 84 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అనంతరం వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షలకు ములుగు ఏరియా ఆస్పత్రికి పంపించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహారెడ్డి, హెచ్ఈఓ సత్యనారాయణ, రామకృష్ణ, యాకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఇళ్లు దగ్ధం



కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న డీటీ శ్రీనివాస్

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎస్సీ కాలనీలో ప్రమాదవశాత్తు రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివారల ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడిచర్ల ఎస్సీ కాలనీకి చెందిన ఇందారపు రవి, ఇందారపు కుమార్‌కు చెందిన ఇళ్లలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారు గమనించి, కుటుంబ సభ్యులకు, స్థానిక ఏఎమ్మార్ కంపెనీకి సమాచారం ఇచ్చారు. కంపెనీకి చెందిన వాటర్ ట్యాంకర్ రావడంతో దాని ద్వారా స్థానికులు మంటలను ఆర్పారు. అప్పటికే ఇంటిలోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ అక్కడి చేరుకొని నష్టం వివరాలను ప్రాథమిక అంచనా వేశారు. ఇందారపు కుమార్‌కు చెందిన ఇల్లు, ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిపోయిందని దాదాపు రూ.15 లక్షల నష్టం జరిగిందన్నారు. అలాగే ఇందారపు రవికి చెందిన ఇల్లు పాక్షికంగా కాలిపోవడంతో దాదాపు రూ.3 లక్షల నష్టం జరిగిందని అంచనా వేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. నష్టపోయిన బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేసినట్ల ఆయన పేర్కొన్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి



నిరసన దీక్షలో మాట్లాడుతున్న స్వామి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు స్వామి

ఏటూరునాగారం: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే ఉద్యోగాలను భర్తీ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వావిలాల స్వామి అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్ష కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమానికి స్వామి హాజరై మాట్లాడుతూ నేడు ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలన్నారు. గ్రూప్-1 ఉద్యోగాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని కోరారు. వర్గీకరణ చేపట్టిన తర్వాతనే పోటీ పరీక్షలు, ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్ 1, 2, 3 ఎక్స్టెన్షన్ ఆఫీసర్స్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన ఫలితాలను విడుదల చేస్తామని టీజీపీఎస్సీ ద్వారా ప్రకటన చేసి మాదిగ, మాదిగ ఉపకులాలకు, ఎస్సీల్లో ఉన్న ఇతర కులాలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వావిలాల సాంబశివరా వు, ఎంపెల్లి శంకర్, దేపాక సతీష్, గుగ్గిళ్ల సురేష్, ఎంపెల్లి సునీల్, వేణు, నర్సింగరావు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలి

ములుగు రూరల్ : పార్లమెంట్‌లో రైతులు పండించిన పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వెంకట్‌రెడ్డి, ఎండీ గఫూర్‌పాషా మాట్లాడుతూ రైతాంగ పోరాట ఫలితంగా కేంద్రం మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తూ రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ఆ చట్టాలను ప్రతిబింబించేలా జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదాలను విడుదల చేసిందని అన్నారు. ముసాయిదాలో పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కానీ, కొనుగోలుకు గ్యారంటీ గానీ లేదని అన్నారు. రాష్ట్రాల హక్కులను కాలరాసి, మార్కెట్ వ్యవస్థను కేంద్రం తన ఆధీనంలోకి తీసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తీగల ఆగిరెడ్డి, గుండు రామస్వామి, కొర్ర రాజు, కస్సోజు ఆనందం, పీఏసీఎస్ డైరెక్టర్ నిమ్మల భిక్షం, దబ్బకట్ల పాణి, కుందూరు సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



నవాబుపేటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి రూరల్ : క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చిట్యాల: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం చిట్యాల, టేకుమట్ల మండలాలకు చెందిన 48 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే మారుమూల గ్రామాలు, పంచాయతీల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ జయశ్రీ, తహసీల్దార్ హేమ, మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, రాష్ట్ర, జిల్లా నాయకులు గాజర్ల అశోక్, ముకిరాల మధువంశీకృష్ణ, టేకుమట్ల మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, నాయకులు దబ్బెట అనిల్, ఎండీ రఫీ, రాజు, శ్రీనివాస్, రత్నాకర్‌రెడ్డి, ఎండీ రాజమహ్మద్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే లక్ష్యం

భూపాలపల్లి రూరల్: పేద, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటులో భాగంగా మన భూపాలపల్లికి అవకాశం లభించిందన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పీసీసీ సభ్యులు దబ్బేట రమేశ్ ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానం చేశారు. అనంతరం భూపాలపల్లి మండలంలోని పలు గ్రామాలకు చెందిన 43 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) జిల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధుల మంజూరు

మల్హర్: మండలంలోని పెద్దతూండ్ల కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ రోడ్డు నిర్మాణానికి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నిధులు మంజూరు చేయించినట్లు మాజీ ఎంపీపీ మల్హల్‌రావు తెలిపారు. మండలంలోని తాడిచర్ల సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మంపల్లి మానేరు వంతెన నుంచి భూపాలపల్లి జిల్లా వరకు గతంలో రోడ్డుకు నిధులు మంజూరు కాగా ఫారెస్ట్ క్లియరెన్స్‌కు డబ్బులు లేక ఫారెస్ట్ రోడ్డు పనులు ఆగిపోయినట్లు తెలిపారు. కిషన్‌రావుపల్లి ఫారెస్ట్ రోడ్డు క్లియరెన్స్‌కు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రభుత్వం జీఓ నంబర్ 113 ద్వారా రూ.33.70 కోట్లు నిధులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్‌బాబుకి ఈ ప్రాంత వాసుల తరుపున ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, నాయకులు పేరాల వెంకటేశ్వరరావు, బొబ్బిలి రాజు, మురళీధర్ రావు, ఇందారపు ప్రభాకర్, మధుసూదన్ పాల్గొన్నారు.